



భూమిపూజ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

రూ.30వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలి

- ఐఆర్ 30 శాతం వెంటనే ప్రకటించాలి - ఫ్యాప్టో రాష్ట్ర నేతలు సురేష్ కుమార్, ప్రకాష్ రావు
- కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయలు రూ.30 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని ఫ్యాప్టోరాష్ట్ర నేతలు సురేష్ కుమార్, ప్రకాష్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే ఐ ఆర్30 శాతం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు భారీగా కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి బుధవారం నిరసన తెలిపారు. ఫ్యాప్టో ఛైర్మన్ సేవా లాల్ నాయక్(ఆప్టా) అధ్యక్షతన జరిగిన నిరసనలో ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు కె.సురేష్ కుమార్ కె.ప్రకాష్ రావు మాట్లాడుతూ పిఆర్‌సి కమిటీ వేసి, వెంటనే 30 శాతం ఐ అర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చ లేదన్నారు. గత ప్రభుత్వం పిఆర్‌సి కమిటీని నియమించి తర్వాత పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వమైనా వెంటనే పిఆర్‌సి కొత్త కమిటీని ఏర్పాటు చేసి కమిషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్ విధానాలు కాకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు రాబోయే కాలంలో మరిన్ని పోరాటాలను చేపడతామని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి నవీన్ పాటి, ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు గోకారి ,ఎపిటిఎఫ్ 257 రాష్ట్ర నాయకులు రవి కుమార్, ఎపిటిఎఫ్ 1938 నాయకులు ఇస్మాయిల్ మాట్లాడుతూ 2022 నుండి సరెండర్ లీవ్‌లు బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మరిన్ని పోరాటాలను చేపడతామని వారు పేర్కొన్నారు. జిల్లా సెక్రెటరీ జనరల్ భాస్కర్ (బిటిఎ), రవి కుమార్ (యుటిఎఫ్), జనార్ధన్ (ఎస్‌టియు), ప్రసన్న రాజు (ఎస్‌టియు), మరియానందం (ఎపిటిఎఫ్ 1938), రామకృష్ణ (ఎపిటిఎఫ్ 1938), రంగన్న ఫ్యాప్టో జిల్లా కోశాధికారి (ఎపిటిఎఫ్ 257) నాగరాజు (ఎ పి టి ఎఫ్ 257), రాజసాగర్ (అప్టా), కరె కృష్ణ (డిటిఎఫ్), లక్ష్మయ్య (పిఇ టి అసోసియేషన్) మొయిన్ (రుటా), గులాబ్ భాష (రుటా), యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు నాగమణి, జిల్లా నాయకులు యెహోషువ, దావీదు, దుర్గాప్రసాద్, తిమ్మన్న, ఇబ్రహీం, నరసింహ, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప సురేష్, షబ్బీర్, జెవివి జిల్లా అధ్యక్షుడు బీడీ సుధీర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న సురేష్ కుమార్

300 పశువుల నీటితొట్ల నిర్మాణం

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వేసవి కాలంలో పశువులు, మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు 300 పశువుల నీటి తొట్లను నిర్మించనున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బుధవారం కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ శివారులో పశువుల నీటి తొట్ల నిర్మాణానికి జిల్లా కలెక్టర్, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి భూమి పూజ చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో పశువులు, గొర్రెలు, మేకలు తదితర మూగ జీవాలకు తాగునీటి కోసం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నీటి తొట్లను నిర్మించనున్నామని, ఇందులో భాగంగా జిల్లాలో 300 నీటి తొట్ల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. ఒక్కో నీటి తొట్టికి రూ.34 వేల ఖర్చు అవుతుందన్నారు. ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్నామని తెలిపారు. ఏప్రిల్ 10 లోపు వీటి నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వేసవిలో వీటిని సంపూర్ణంగా వినియోగించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ డ్వామా పిడిని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పిడి వెంకట రమణయ్య, కర్నూలు రూరల్ తహశీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విమాన సర్వీసులు వెంటనే ప్రారంభించాలి

- కేంద్ర మంత్రిని కోరిన మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నుండి విజయవాడకు విమాన సర్వీసులు ప్రారంభించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్ కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని రాష్ట్ర మంత్రి టిజి.భరత్‌ను కలిశారు. కర్నూలు - విజయవాడ విమాన సౌకర్యంపై చర్చించినట్లు మంత్రి టిజి. భరత్ పేర్కొన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నానని కేంద్ర మంత్రి తెలిపినట్లు టిజి భరత్ చెప్పారు. త్వరలోనే దీనికి సంబంధించి అడుగులు పడే అవకాశం ఉందని చెప్పారన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇక్కడ అన్ని రకాల పరిశ్రమలు పెట్టేందుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని ఆయన తెలిపారు. విమాన సర్వీసులుకూడా అందుబాటులోకి వస్తే పారిశ్రామికవేత్తల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందన్నారు.



ఇన్‌ఛార్జ్ వీసీగా ఉమా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ , క్లస్టర్ వర్సిటీల ఇన్చార్జ్ విసిగా పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ విఉమా బుధవారం బాధ్యతలను స్వీకరించారు. వేర్వేరుగా వర్సిటీలలో ఆమె బాధ్యతలను స్వీకరించిన అనంతరం అక్కడే ఉన్నతాధికారులతో సమావేశం అయ్యారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బోధన అందించాలని కోరారు. రెండు వర్సిటీల అధ్యాపక బృందంతో కూడా ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో రాయలసీమ వర్సిటీ రిజిస్టర్ బి.విజయకుమార్ నాయుడు క్లస్టర్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, వర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ సివి కృష్ణారెడ్డి, నరసింహులు, ఎగ్జామినేషన్స్ డీన్ వెంకటేశ్వర్లు, సుందరానందపుచ్చా, విశ్వనాథరెడ్డిలతోపాటు క్లస్టర్ వర్సిటీప్రిన్సిపల్స్ డాక్టర్ వివిఎస్.కుమార్, డాక్టర్ ఇందిరాశాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఉమా

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు

- కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కూటమి ప్రభుత్వం వచి పది నెలలు అవుతున్న కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డు లేక నష్టపోతున్నారని వెంటనే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కర్నూల్ లో కార్మిక కర్షక భవనంలో కౌలు రైతుల జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తాండ్రపాడు సర్పంచి బాలపీర అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన హరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్న నేటి వరకు కొత్త కౌలు రైతు చట్టం తీసుకొని రాలేదని, దీనివల్ల కౌలు రైతులు అందరికీ గుర్తింపు కార్డులు అందలేదని అన్నారు .కార్డు లేకపోవడం వల్ల బ్యాంకుల నుండి పంట రుణాలు అందక వడ్డీ వ్యాపారస్తులతో అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి పంటలు పండించి తీరా మార్కెట్‌కు తీసుకొని వెళ్తే కనీసం మద్దతు ధరలకు కొనుగోలు చేయలేకపోవడం వల్ల కౌలు రైతులు అప్పుల పాలయ్యారన్నారు. కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. చివరికి ఆత్మహత్య చేసుకున్న వారికి కౌలు రైతు గుర్తింపు కార్డు లేకపోవడం వల్ల పరిహారం అందలేదన్నారు. కరువు వల్ల నష్టపోయిన కౌలు రైతులకు ఇన్పుట్ సబ్సిడీ అందలేదన్నారు. భవిష్యత్తులో అన్నదాత సుఖీభవ రూ.20 వేలు కూడా అందే పరిస్థితి లేదన్నారు. తక్షణమే పాత కౌలు చట్టాన్ని రద్దుచేసి కొత్త కౌలు చట్టం తెచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భూ యజమాని గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కులాలు, మతాలకు అతీతంగా గుర్తింపు కార్డు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కర్నూలు జిల్లాలో 60,000 లకు గాను కేవలం 20,000 లోపు కౌలు కార్డులు ఇవ్వడం సోచనీయమన్నారు. కర్నూలు జిల్లాలో కొన్ని మండలాలు మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకోవడం సరైనది కాదన్నారు. వలసలకి పుట్టినిల్లు కర్నూలు జిల్లా అయితే కరువుమండలాలు ప్రకటనలో ప్రభుత్వ పక్షపాత ధోరణి కనిపిస్తుందన్నారు. ఇప్పటికైనా జిల్లాలో ఉన్న మండలాలన్నీ కూడా కరువు మండలాలుగా ప్రకటించి రైతులను,కౌలు రైతులను ఆదుకోవాలన్నారు. ఈ సమస్యలపై జిల్లా రెవిన్యూ అధికారి వినతి పత్రం ఇచ్చామన్నారు. ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొని వచ్చి కౌలు రైతులకు న్యాయం చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణలతో పాటు కౌలు రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సమసమాజ స్థాపనే సిపిఎం లక్ష్యం

- జాతీయ మహాసభల నేపథ్యంలో పతాకావిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈనెల 2 నుంచి 6 వరకు నిర్వహించే సిపిఎం జాతీయ 24వ మహాసభల ప్రారంభ సూచికంగా కర్నూలు సుందరయ్య సర్కిల్‌లో సిపిఎం జెండాను జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ ఆవిష్కరించారు. అమరజీవి సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.రాముడు అధ్యక్షతన నిర్వహించిన సభలో రాష్ట్ర కమిటీ సభ్యులు హరి బాబు , జి ల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి. ఆనంద్‌బాబు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో వున్న మోడి ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్ట డానికి ప్రభుత్వ రంగ సంస్థలు అయిన ఇన్సూరెన్స్, బ్యాంకు, విద్యుత్, టెలికాం రంగాలను ప్రైవేట్ వారికి కట్టబెడుతుందన్నారు. మరొకపక్క ప్రజలు మధ్య చిచ్చుపెట్టేవిధంగా మతోన్మాదాన్ని, ప్రాంతీయ తత్వాన్ని, బాషా విబేధాలను రెచ్చకొట్టడమే పనిగా పెట్టుకుందన్నారు. దేశ స్వావలంబన, సార్వభౌమాధికారాన్ని మంటగలపి నియంతృత్వ పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ఈ విధానాలపై మదురైలో జరుగుతున్న పార్టీ అఖిల భారత మహాసభలలో చర్చించి రానున్న కాలంలో ప్రజా ఉద్యమాలు చేయడానికి కార్యక్రమం రూపొందించనున్నామన్నారు. వాటిని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి.గురు శేఖర్, నగర కార్యదర్శి వర్గసభ్యులు ఆర్.నరసింహులు, సిహెచ్ సాయిబాబా, కె.సుధాకరప్ప, కె.ప్రభాకర్, ఎస్ఎండి.షరీఫ్, రామకృష్ణ, నగర కమిటీ సభ్యులు ఎస్.మహ్మద్ రఫీ, బి.రాధాకృష్ణ, జి.ఏసు, ఎం.భాస్కర్, సి.శేషాద్రి, హుస్సేన్‌బాష, సి.చలపతి, ఉశేన్ వలి, ఎ.శ్రీనివాసులు, విజయ్, రోశయ్య, మల్లికార్జున, విజయుడు, నాగరాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.



వెంకట లక్ష్మమ్మ జ్ఞాపకార్థం అనాధలకు అన్నదానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు సతీమణి వెంకట లక్ష్మమ్మ 10వ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు బి. రాజేష్, బి.సురేష్ ఆధ్వర్యంలో దిన్నెదేవరపాడు గ్రామంలోని టిజివి కాలనీలో ఉన్న కేర్ హోమ్స్ మిషన్ సొసైటీలోని 30 మంది అనాధలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షులు పాస్టర్ అబ్రహం, నిర్వాహకులు ఎస్ కురుపమ్మ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్ మండలం నన్నూరు గ్రామపంచాయతీలో చలివేంద్రాన్ని ఎంపిడిఒ శ్రీనివాసులు బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎండల తీవ్రత నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి , సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



కర్నూలు బి క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు అందించే ఉచిత పుస్తకాలను సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్ తీర్చిదిద్దు కోవాలన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రసన్నకుమార్, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సారధి పటేల్, లక్ష్మి ,గిరిజారాణి, సుజాత, మల్లేష్, కృష్ణ మోహన్, ఉల్లోజిరావు,విద్యార్థులు పాల్గొన్నారు.

బాబర్ లస్సీకి భలేగిరాకి

-26 జనవరి నుంచి జులై వరకు నడుస్తుంది
-వేసవిలో ఎక్కువ వినియోగం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

లస్సీ ఒక సాంప్రదాయ భారతీయ పానీయం. ఇది పెరుగు, చక్కెర నీరు, మసాలా దినుసులు , కొన్నిసార్లు పండ్లను ఉపయోగించి తయారు చేస్తారు. ఇది వేసవిలో చల్లదనాన్ని అందించడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలను కలిగిస్తుంది. అయితే కర్నూలు అనేక ప్రాంతాల్లో లస్సీ తయారు చేస్తారు. నగరంలో పెద్దమార్కెట్ వద్ద అందులో బాబర్‌లస్సీకి ప్రత్యేక స్థానం ఉంది. బాబర్ అనే యజమాని దాదాపు 60 యేళ్ల క్రితం ఈ లస్సీ తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. అప్పటినుంచి బాబర్‌లస్సీగానే కొనసాగుతుంది. ఆయన మరణానంతరం ఆయన వారసులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆయన వారసుడు మహ్మద్ అయాజ్ బాబర్‌లస్సీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...

ప్రతి ఏడాది జనవరి 26 నుంచి జులై వరకు లస్సీ షాపును నిర్వహిస్తారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలనుంచి సాయతంత్రం వరకు ఉంటుంది. బాబర్ లస్సీ తయారీకి 300 నుంచి 350 లీటర్ల పాలను రైతులనుంచి సేకరిస్తారు. కర్రెల పొయ్యిమీద కుండలో రాత్రి పాలను వేడి చేస్తారు. రాత్రి తోడు వేస్తారు. ఉదయం పెరుగు అవుతుంది. పెరుగు ఎక్కువ పులుపు, మరీ తక్కువ పులుపు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. శుభ్రత ఎక్కువ పాటిస్తారు. శుభ్రత లేకుంటే పెరుగులో రుచి మారిపోతుంది. ఇక్కడ లస్సీ తయారికి 12 మంది నుంచి 15 మంది పని చేస్తారు. వారు కూడా ప్రతిరోజు వేసుకునే దుస్తులు శుభ్రంగా ఉతికిన వాటినే ధరిస్తారు. ఇక్కడ లస్సీ తాగడానికి వివిధ ప్రాంతాల నుంచి వస్తారు. ఇక్కడ లాభాలమీద దృష్టి లేదంటారు నిర్వహకులు. వేసవిలో బాగా నడుస్తుంది. 12నుంచి 15 మంది ఉపాధి ఇవ్వగలుగుతున్నారు. నష్టం మాత్రం లేదు...

బాబర్ లస్సీ తయారీ విధానం: లస్సీని తయారు చేయడానికి అనేక మార్గాలు ఉన్నాయి. బాబర్ లస్సీ తయారికి పెరుగు, ముందే తయారు చేసుకున్న చక్కెర పాకం, ఐస్ తగినంత వేసుకుని చిలుకుతారు. పెరుగుతయారిలో వచ్చిన పాలకోవ, (మీగడ) వేస్తారు. ఇది భలే రుచిగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఇతరులు ఇలా కూడా తయారు చేస్తారు. పెరుగు, నీరు, ఉప్పు, జీలకర్ర పొడి, నల్ల మిరియాల పొడిని కలిపి బాగా చిలుకకుతారు. మామిడి లస్సీలో మామిడి గుజ్జు, పెరుగు, పంచదార, యాలకుల పొడిని కలిపి బాగా చిలుకుతారు. మామిడి ముక్కలతో అలంకరిస్తారు. ఇవే కాకుండా స్ట్రాబెర్రీ, అరటిపండు, పుదీనా మొదలగు వాటితో కూడా లస్సీ తయారు చేసుకుంటారు. ఎన్ని లస్సీలున్నా బాబర్‌లస్సీ మాత్రం భలేరుచి అని చెప్పవచ్చు. చిన్న పిల్లలు, మహిళలు, పురుషులు, వృద్ధులు అందరూ తాగుతారు.

లస్సీ ఉపయోగాలు: జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. లస్సీలో ప్రోబయోటిక్స్ ఉంటాయి, ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. శరీరాన్ని చల్లబరుస్తుంది. లస్సీ వేసవిలో శరీరాన్ని చల్లబరుస్తుంది , డీహైడ్రేషన్‌ను నివారిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. లస్సీలో విటమిన్లు , ఖనిజాలు ఉంటాయి, ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. ఎముకలను బలపరుస్తుంది. లస్సీలో కాల్షియం ఉంటుంది. ఎముకలను బలపరుస్తుంది. లస్సీలో కేలరీలు తక్కువగా ఉంటాయి, ఇది కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది.



పెద్ద మార్కెట్ వద్ద బాబర్ లస్సీ దుకాణం



బాబర్ లస్సీ యజమాని మహ్మద్ అయాజ్

యుపిహెచ్‌సిని పరిశీలించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్



కర్నూలు పట్టణం శరీన్ నగర్‌లో యుపిహెచ్‌సి ఒపి గది, వాక్సిన్ నిల్వ గది , ల్యాబ్ , స్కానింగ్ గధి మందుల గదిని తనిఖీ చేసి రికార్డులు, రిపోర్టులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి శాంతికళ పరిశీలించారు. డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ప్రతి రోజు కనీసం 100 మందికి ఒపి సేవలు అందించి ఆ వివరాలను డాక్టర్ కేర్ పోర్టల్‌లో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్‌ను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అక్కడ ఏర్పాటుచేసిన ఒఆర్ఎస్ కార్నర్‌ను పరిశీలించారు. ప్రస్తుతం వాతావరణంలో వచ్చు మార్పులవల్ల ఉష్ణోగ్రతలలో పెరుగుదలవల్ల ప్రజలు వడదెబ్బకు గురి అయ్యే అవకాశం ఉన్నందున ప్రతి రోజు పట్టణ ఆరోగ్య కేంద్రానికి వచ్చు వారికి వడదెబ్బ నివారణ చర్యల గురించి అవగాహన కల్పించాలన్నారు. వడదెబ్బ నివారణలో ఒఆర్ఎస్ ద్రావణం ప్రాముఖ్యత గురించి వారికి డెమానిస్ట్రేషన్ ద్వారా వివరించాలని తెలిపారు. అనంతరం శరీర్ నగర్ పరిధిలోని 71వ సచివాలయంలో జరుగుచున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తనిఖీ చేసి గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు రిపోర్ట్స్‌ను పరిశీలించారు. వారు మాట్లాడుతూ గర్భవతులు, ఐదేళ్ల లోపు పిల్లలలో టీకాలకు అర్హులైన వారి జాబితాను తయారు చేసుకొని సమయాను సారంగా ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పక ఇవ్వాలన్నారు. ఆ వివరాలను మాతా శిశు సంరక్షణ కార్డు, ఆర్ సిహెచ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. దీనివలన పిల్లలను ప్రాణాంతక వ్యాధుల బారినుండి కాపాడ వచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంపిఒ డాక్టర్ ఉమా, వైద్యాధికారి డాక్టర్ ఫర్వీన్ తబ్సుం , డెమో శ్రీనివాసులు శెట్టి , డిపిఒ విజయరాజు , డిప్యూటీ డెమో చంద్రసేకర్ రెడ్డి , ఆరోగ్య పర్యవేక్షకురాలు పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

సిఐటియు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరం శ్రీరామ్ నగర్ లోని శ్రీ చైతన్య స్కూల్ దగ్గర బుధవారం సిఐటియు న్యూ సిటీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు 9వ డివిజన్ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులతో సంతకాల సేకరణ చేపట్టారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు చాలీచాలని జీతంతో కుటుంబాలను పోషించుకోలేక పోతున్నారన్నారన్నారు. . తెల్లవారుజామున 5 గంటలకు హాజరై దుర్గంధ వాసన వెదజల్లే కాలువలను, రోడ్లను శుభ్రం చేస్తూ, తమ ఆరోగ్యాలను ఏమైనా పర్వాలేదు ప్రజల ఆరోగ్యాలు బాగుండాలని అంకిత భావంతో పనిచేసేవారు మున్సిపల్ కార్మికులన్నారు. కూటమి ప్రభుత్వం 2025 మార్చి 6న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ రద్దుచేసి, పొరుగుసేవల సిబ్బంది నియమకాలు ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని తీర్మానించినట్లు పత్రికల్లో వచ్చిందని, ఈ వార్త మున్సిపల్ కార్మికులకు తీవ్ర ఆందోళన గురిచేసిందన్నారు. సంతకాలు సేకరించి ఈ నెల 10న మున్సిపల్ శాఖమంత్రికి ఇస్తామని, మంత్రి స్పందించి ఏజెన్సీలకు ఇచ్చే ఆలోచన మానుకుని ,మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయకపోతే రాబోయే రోజుల్లో సిఐటియు పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. సిఐటియు నాయకులు ఎస్.అజ్మత్, మున్సిపల్ కార్మికులు ఎస్.మహేశ్వరమ్మ, సి.కీర్తన, బి. సావిత్రమ్మ, బి.మరియమ్మ, పి. లక్ష్మీదేవి, గోరంట్లమ్మ, డి.మల్లేశ్వరి ,తులసి, వై. కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.



సంతకాలను సేకరణ సేకరిస్తున్న నరసింహులు

ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్

చొక్కా సునీల్ కుమార్

ప్రజాశక్తి-మద్దికేర



పదోతరగతి పాస్ అయిన విద్యార్థులు ఉచిత పాలిటెక్నిక్ కోచింగును సద్వినియోగం చేసుకోవాలని ఆపద్బాంధవ సేవ సమితి వ్యవస్థాపకులు చొక్కా సునీల్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మద్దికేర కొత్తపల్లి రోడ్డు వశిష్ట స్కూలులో ఈనెల 5 నుంచి ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పదవ తరగతి పూర్తి అయి పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌కు ప్రిపేర్ అయ్యే మద్దికేర , మండల పరిధిలోగల వివిధ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచిత పాలిసెట్ కోచింగ్ ఆపద్బాంధవ సేవాసమితి ఆధ్వర్యంలో ప్రారంభం అవుతుందన్నారు. ఈసదావకాశాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా ఆపద్బాంధవ సేవా సమితి వ్యవస్థాపకులు చొక్కా సునీల్ కుమార్, వశిష్ట స్కూల్ కరస్పాండెంట్ కోలీపకీరప్ప పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కోసం మరిన్ని వివరాల కొరకు 8247452174, 8919887832 నెంబర్లను సంప్రదించాలన్నారు.


మాట్లాడుతున్న ఆనంద్ బాబు

22న అంబేద్కర్ కళారూపం నాటకం

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని మాధవరం గ్రామంలో జరిగే అంబేద్కర్ జీవిత చరిత్రను కళారూపం నాటకాన్ని జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, అంజి, నాయకులు అనిల్ కోరారు. బుధవారం స్థానికంగా ఓ ప్రైవేట్ లాడ్జిలో కెవిపిఎస్ మండల నాయకులు సురేష్, మారెప్ప అధ్యక్షత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు మాట్లాడారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జీవిత చరిత్రని ఆధునిక హంగులతో రాష్ట్రవ్యాప్తంగా సామాజిక చైతన్య, సాంస్కృతిక ఉత్సవాల పేరుతో కళారూపాన్ని వేయించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. నాటకాలను కులమత, ప్రాంతాలకు అతీతంగా ప్రజలు 22న నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో నాటకాలు మంత్రాలయం మండలం మాధవరం నుంచి ఈనెల 22న ప్రారంభమై, 23న ఎమ్మిగనూరు, 24న ఏసుగు బాల, 25న ఉల్లెల్లా, 26న కర్నూలులో నాటకాలను ప్రదర్శిస్తున్నామని చెప్పారు. అటు నుంచి నంద్యాల, అనంతపురం, సత్యసాయి, కడప జిల్లాల మీదుగా నాటకాలు వేస్తూ విజయవాడలో ముగుస్తుందన్నారు. అనంతరం నాటకాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కోసిగి మండల కార్యదర్శి రామకోటి హనుమంతు, అధ్యక్షులు ప్రకాష్, కౌతాళం మండల నాయకులు బసవ, బసవరాజు, మంత్రాలయం మండల నాయకులు వీరేష్, దానియేలు, వీరేష్, దేవమని, రాజేష్, నరసన్న పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు కార్యదర్శిగా
కల్పన బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


మాట్లాడుతున్న ఎం.కల్పన

ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ అధికారిగా ఎం.కల్పన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ సెక్రటరీగా విధులు నిర్వహించిన రామ్మోహన్ రెడ్డి గత నెలలో విరమణ పొందడంతో నంద్యాల మార్కెట్ కమిటీల కార్యదర్శిగా పనిచేస్తున్న కల్పనకు ఆదోని మార్కెట్ కమిటీకి పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఎసి) అప్పజెప్పారు. బాధ్యతలు స్వీకరించిన ఇన్‌ఛార్జీ కార్యదర్శి కల్పన మాట్లాడుతూ... ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో రైతులకు అందించాల్సిన సౌకర్యాలు ప్రభుత్వపరంగా అందిస్తామని తెలిపారు. అందరి సహకారంతో మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామన్నారు. అనంతరం మార్కెట్‌లో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డు అసిస్టెంట్ కార్యదర్శి శాంత కుమార్ పాల్గొన్నారు.

చిప్పగిరిలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - చిప్పగిరి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్

తహశీల్దార్ కార్యాలయానికి సమస్యలపై వచ్చే వారు తాగునీటికి ఇబ్బందులు పడకూడదని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశామని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ రెవెన్యూ కార్యాలయ సిబ్బంది అంతా ఆలోచించి వారి సలహా మేరకు చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే వారందరూ చలివేంద్రం ఏర్పాటు చేసినందుకు అభినందించారు.

గోనెగండ్లలో ముగిసిన వేలం పాటలు

ప్రజాశక్తి - గోనెగండ్ల


వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

గోనెగండ్ల పంచాయతీలో వేలం పాటలు ముగిసినట్లు సర్పంచి హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ తెలిపారు. బుధవారం నిర్వహించిన వేలం పాటలో బండి మెట్ట రూ.1.21 లక్షలకు బడే సాహెబ్, కమేలాను రూ.83 వేలకు బలిగేరి శేషాద్రి, సంత మార్కెట్‌ను రూ.84,500లకు గంద్ర గొడ్డలి శీను దక్కించుకున్నట్లు వారు తెలిపారు. ఈ వేలం పాటల ద్వారా గతేడాది కంటే అధికంగా పంచాయతీకి ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు.

విజన్-2047లో భూ పంపిణీని చేర్చాలి

- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్ర ప్రభుత్వం విజన్-2047లో భూపంపిణీని చేర్చాలని వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం దేవనకొండలోని సిఐటియు భవన్‌లో వ్యకాస జిల్లా సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలను మభ్య పెట్టే విజన్లు కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం నిర్మూలన కోసం కావాలని, అది కేవలం మాటలతో రావని తెలిపారు. ప్రజలు ఆర్థికంగా స్వయం శక్తితో ఎదగడానికి అవసరమైన భూపంపిణీ గ్రామీణ ప్రాంతాల్లో అవసరమని పేర్కొన్నారు. పి-4 పేరుతో ప్రభుత్వం ఆర్భాటం చేస్తోందని, పేదరిక నిర్మూలన సాధ్యం కావాలంటే సంక్షేమం, అభివృద్ధి సమతుల్యంగా ఉండి గ్రామీణ ప్రజలపై భారాలు తగ్గించేదిగా ఉండాలని తెలిపారు. ఒకవైపు ప్రజలపై అన్ని రకాల భారాలు వేస్తూ, రైతులకు గిట్టుబాటు ధరలు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి దొరకడం లేదని, సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో భూమి, ఇల్లు, ఇళ్ల స్థలాల సాధనకు, కరువు నివారణలో భాగంగా పెండింగ్ ప్రాజెక్టుల సాధనకై వ్యకాస ఉద్యమిస్తుందని పేర్కొన్నారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న, తిక్కన్న, బాలకృష్ణ, సహాయ కార్యదర్శులు రామాంజనేయులు, శ్రీరాములు, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, డివైఎఫ్ఐ నాయకులు నాగేంద్ర, వ్యకాస నాయకులు యూసుఫ్ బాష, బజారి, రాముడు, వెంకటేష్, ఈరప్ప, డివైఎఫ్ఐ మండల నాయకులు నాగేంద్ర పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

పాడి పరిశ్రమ అభివృద్ధి ధ్యేయం

- టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్


భూమిపూజ చేస్తున్న వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి - హాలహర్వి

పాడి పరిశ్రమ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ తెలిపారు. బుధవార హాలహర్విలోని నిట్రవట్టి రహదారి పక్కన పాడి పశువుల తాగునీటి సంరక్షణ కోసం ఉపాధి హామీ చట్టంలో భాగంగా నీటి తొట్ల పనులకు భూమిపూజ చేశారు. ఏపీడీ పకీరప్ప, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ రాము, హాలహర్వి సర్పంచి మల్లికార్జున, మండల కన్వీనర్ సుధాకర్, క్లస్టర్ ఇన్‌ఛార్జీ పాల్ రెడ్డి, మాజీ ఎంపిటిసి ఉమకాంత్ స్వామి పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి

హొళగుంద : హొళగుందలో టిడిపి బలోపేతానికి ప్రత్యేక చొరవ చూపుతామని టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ తెలిపారు. టిడిపి మండల సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ, మండల మాజీ కన్వీనర్ గజ్జహళ్లి సిద్ధప్ప బుధవారం ఆలూరు టిడిపి కార్యాలయంలో వీరభద్రగౌడ్ సమక్షంలో అనుచర గణంతో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వీరభద్రగౌడ్ మాట్లాడారు. గజ్జహళ్లి సిద్ధప్ప పార్టీ కోసం విశిష్ట సేవలందించారని, ఆయన రాకతో పార్టీకి మరింత బలం చేకూరిందని తెలిపారు. టిడిపి మండల కన్వీనర్ తిప్పయ్య, సీనియర్ నాయకులు ఎల్లార్తి మల్లికార్జున, తోక వెంకటేష్, మాజీ ఎంపిటిసి కుడ్లూరు ఈరప్ప, నాయకులు అయ్యప్ప, దమ్మూల తిక్కస్వామి, కన్నయ్య, చాకలి బద్రి, మంగలి సంజీవ్, కొరివి సాయిబేష్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

వైసిపి అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కౌతాళం

రాబోయే రోజుల్లో వైసిపి అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కోరారు. బుధవారం వైసిపి మండల కమిటీకి ఎన్నికైన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త, ప్రతి గ్రామ, మండల నాయకులు కష్టపడి పనిచేయడం వల్లే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచామని తెలిపారు. ప్రజలకు అండగా ఉండి అందరూ కష్టపడి పనిచేసి రాబోయే రోజుల్లో వైసిపిని గెలిపించుకుందామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలి, ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వైసిపి నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేయడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తే వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. వైసిపి కౌతాళం మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాదచారి, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కోఆప్షన్ సభ్యులు మాబు సాబ్, మండల జిల్లా కమిటీలో ఎన్నికైన ఏకం రెడ్డి, మండల కమిటీ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సుధాకర్ రెడ్డి, హాల్వి చెన్నప్ప, జనరల్ సెక్రటరీ తోవి నరసప్ప, గురునాథ్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, నీలకంఠ రెడ్డి, శ్రీకాంత్, సిద్ధేషా, నరసింహులు, ఆదిరెడ్డి, కౌతాళం సర్పంచి పాల్ దినకరన్, మల్లికార్జునరెడ్డి, అనిల్, రామస్వామి పాల్గొన్నారు.

'రీ సర్వే సమస్యలను నివృత్తి చేస్తాం'

ప్రజాశక్తి - చిప్పగిరి

రీ సర్వే నిర్వహించేటప్పుడు ఏ సమస్య వచ్చినా రైతుల సమక్షంలోనే నివృత్తి చేస్తామని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం బంటనహాల్ గ్రామంలో రీసర్వే నిర్వహించి పూర్తి చేసిన నేపథ్యంలో రెవెన్యూ కార్యదర్శి మీనా ఆధ్వర్యంలో రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో రీసర్వే నిర్వహించేందుకు రైతులంతా సహకరించినందుకు త్వరగా పూర్తి చేశామన్నారు. రీసర్వే నిర్వహించేటప్పుడు ఏ రైతుకైనా సర్వేపై అనుమానం వస్తే రీసర్వే బృందాలకు తెలిపి మళ్లీ వారి సమక్షంలోనే సమస్యలను నివృత్తి చేస్తామని తెలిపారు. రైతుల పొలం సర్వే నెంబరు ఎల్‌పిఎంలో పొందుపరుస్తామని చెప్పారు. రైతులు కూడా ఎల్‌పిఎం ద్వారా వారి సర్వే నెంబర్లు చూసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. సర్పంచి సుశీలమ్మ, రీ సర్వే డిటి సాయి వినీత్, మండల సర్వేయర్ నారాయణ, ఆర్ఐ సునీత, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, విఆర్‌ఒలు పెద్దన్న, వన్నూరు, అంజి పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు'

ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్ర వైసిపి బూత్ సంయుక్త సహాయ కార్యదర్శిగా తనను నియమించడంలో సహకారం అందించిన ఎమ్మెల్యే బి.విరుపాక్షికి తెర్నేకల్ మధుసూదన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర వైసిపి బూత్ కమిటీ సంయుక్త సహాయ కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా మధుసూదన్ రెడ్డిని వివిధ గ్రామాలకు చెందిన వైసిపి కార్యకర్తలు, నాయకులు కలిసి పూలమాలలతో సన్మానించారు. ఎంపిపి భర్త లుముంబా, తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్, ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, ఉప సర్పంచి కనుకు ఈరన్న, మాజీ ఎంపిటిసి వీరన్న, వైసిపి నాయకులు బడే సాబ్, దుమ్ము హనుమంతు, నాగిరెడ్డి, శివ, చాకలి శ్రీనివాసులు పాల్గొన్నారు.


కృతజ్ఞతలు తెలుపుతున్న మధుసూదన్ రెడ్డి

చిన్నపాటి తేడా ఉంటే ఆందోళన వద్దు

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో ప్రభుత్వం చేపట్టిన రీసర్వే ప్రక్రియలో భూముల విస్తీర్ణం, కొలతల్లో తేడాలుంటే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. బుధవారం గోనెగండ్లలోని రైతు సేవా కేంద్రంలో నిర్వహిస్తున్న రీసర్వే గ్రామ సభకు ఆయన హాజరయ్యారు. రెవెన్యూ సిబ్బంది చేపట్టిన భూముల వ్యాలిడేషన్ ప్రక్రియ పురోగతిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎకరా పొలంలో 5, 6 సెంట్ల తేడా ఉంటే పెద్దగా ఇబ్బంది ఉండదని, ఆ సర్వే నెంబర్‌లోని అందరి రైతులను కూర్చోబెట్టి సరిచేస్తారని తెలిపారు. 20 నుంచి 30 సెంట్ల తేడా ఉంటే అప్పీల్ చేసుకుంటే మరోసారి సర్వేయర్లను పంపించి రైతుల సమక్షంలో సర్వే చేస్తామని చెప్పారు. అప్పటికీ సంతృప్తి లేకపోతే 21 రోజుల గడువుతో ఆర్ఎస్‌డిటికి, అక్కడ సరిపోకపోతే చివరికి తహశీల్దార్‌కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. తహశీల్దార్ కుమారస్వామి, డిటి విష్ణు ప్రసాద్ పాల్గొన్నారు.

సర్వేయర్ల హాజరు కోసం ప్రత్యేక లాగిన్ ఏర్పాటు చేయాలి



వ్యాలిడేషన్ రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

రీ సర్వేలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగినప్పుడు సబ్ కలెక్టర్‌కు గ్రామ సర్వేయర్లు తమ హాజరు సమస్య గురించి విన్నవించారు. కొంతమంది పంచాయతీ కార్యదర్శులు తమను ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారని మొరపెట్టుకున్నారు. స్పందించిన సబ్ కలెక్టర్ వెంటనే ఎంపిడిఒ మణిమంజరితో ఫోన్‌లో మాట్లాడి రీ సర్వేలో పాల్గొంటున్న సర్వేయర్లు, సంబంధిత సచివాలయానికి వెళ్లలేరని వారి హాజరు నిర్ధారణకు ప్రత్యేక లాగిన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిందని తెలిపారు. లాగిన్ ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శులు సర్వేయర్లను వేధిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.


శ్రీనాథ్ గుప్తకు అభినందనలు తెలుపుతున్న డీఎస్పీ

శ్రీనాథ్ గుప్తకు డీఎస్పీ అభినందనలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా)కు ఉత్తమ సేవ సంస్థగా, వంకదారు శ్రీనాథ్ గుప్త ఉత్తమ సంఘ సేవ కర్తగా, ఉత్తమ సంఘ సేవ కేటగిరిలో బంగారు నంది అవార్డు పొందారు. బుధవారం డీఎస్పీ హేమలతను కలవగా ఆమె అభినందించారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాదుకు చెందిన మెగా హెల్ప్ ఫౌండేషన్ ద్వారా అవార్డు పొందడంతో ఆదోని డీఎస్పీ ఎం.హేమలత ఆయనకు శాలువా కప్పి, సన్మానించారు. ఈ సన్మానం, అభినందనలు, తనకు ఒక్కటే కాకుండా అవోపా టీమ్ మొత్తానికి, మెడికల్ క్యాంపులకు సౌజన్య కర్తగా వ్యవహరించిన కాకుబాళ్ నగేష్‌కు చెందుతుందని ఆయన తెలిపారు.

అమరావతి ఎగ్జిబిషన్ ప్రారంభం


ప్రారంభిస్తున్న కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలో మొదటిసారిగా రోబోటిక్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన అమరావతి రోబోటిక్ ఎగ్జిబిషన్‌ను బుధవారం 35వ వార్డు కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి రోబోటిక్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. అమరావతి ఎగ్జిబిషన్ రాబోయే వేసవి సెలవుల్లో పిల్లలకు, పెద్దలకు మంచి వినోదాన్ని అందించేందుకు వివిధ రకాలైన జెయింట్ వీల్, కొలంబస్, బ్రేక్ డ్యాన్స్, డ్రాగన్ ట్రైన్ తదితర వినోదాత్మక మిషనరీ ఏర్పాటు చేశారని చెప్పారు. సరసమైన ధరలకు పిల్లలకు ఆట వస్తువులు, మహిళలకు గృహోపకరణాలు ఆదోని ప్రజలకు అందుబాటులో ఉంచినందుకు ఎగ్జిబిషన్ నిర్వాహకులు సురేష్, గోపాల్, రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి సౌత్ అధ్యక్షులు మహబూబ్ బాషా, బిజెపి సీనియర్ నాయకులు మునిస్వామి, నబిసాబ్, ఉరుకుందప్ప, శ్రీరాములు, ఈరన్న, నాగేష్, మహేష్ నాయక్, ప్రదీప్ పాల్గొన్నారు.

'ఎస్సీ హాస్టళ్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే బీవీ కృషి అభినందనీయం'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఎస్సీ హాస్టళ్ల ఏర్పాటు ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వరరెడ్డి కృషి అభినందనీయమని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. బుధవారం ఎమ్మిగనూరులో ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయాలని, బీసీ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని, కోసిగి, ఎమ్మిగనూరు రహదారి పనులను ప్రారంభించాలని ఎమ్మెల్యే బీవీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మిగనూరులో ఎస్సీ హాస్టళ్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని, వైసిపి ప్రభుత్వ హయాంలో కూడా పోరాటాలు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బీవీకి విన్నవించినట్లు, ఆయన స్పందించి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, ఉన్నతాధికారాల దృష్టికి తీసుకెళ్లడంతో పక్కా భవనాల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. విద్యార్థి సంఘాల నాయకులు రాజేష్, నాగరాజు, ఖాజా, సురేష్, ఆఫ్రిది, రఘునాథ్, కృష్ణ, దినకర్, అశోక్, విజయ్, వెంకటేష్, వినోద్ పాల్గొన్నారు.

తెర్నేకల్ సంఘటనకు రెవెన్యూ అధికారులదే బాధ్యత

- ఎంపిపి భర్త లుముంబా

ప్రజాశక్తి- దేవనకొండ



మండలంలోని తెర్నేకల్ గ్రామంలో గతనెల 28న గ్రామంలో చోటు చేసుకున్న ఘటనకు రెవెన్యూ అధికారులదే బాధ్యత అని ఎంపిపి భర్త, వైసిపి సీనియర్ నాయకులు లుముంబా తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభ టెంటు తీసి వేస్తున్నప్పుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ప్రతాప్ అనే యువకుడు మృతి చెందినట్లు తెలిపారు. ఈ సంఘటనలో రెవెన్యూ అధికారులను బాధ్యులను చేయాలని పేర్కొన్నారు. గ్రామానికి మంజూరైన నూతన ప్రాథమిక ప్రభుత్వాస్పత్రి నిర్మాణానికి స్థల కేటాయింపుపై రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించాల్సి ఉందని తెలిపారు. కూటమి నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి సర్పంచి అందు బాటులో లేకున్నా గ్రామసభను పంచాయతీ కార్యదర్శి రాముడుతో నిర్వహించారని చెప్పారు. మధ్యాహ్నం గ్రామసభ అయిపోయిందని, సాయంత్రం గ్రామసభ టెంటు తొలగించడంలో ప్రతాప్ అనే యువకుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు తెలిపారు. దీనికి పంచాయతీ కార్యదర్శిని బాధ్యుని చేసి కేసు నమోదు చేయడం విచారకరమన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అవ్వకు 1.3 కిలోల బంగారు కిరీటం

ప్రజాశక్తి - ఆదోని రూరల్



శ్రీమహాయోగి లక్ష్మమ్మ అవ్వ 93వ రథోత్సవం సందర్భంగా అవ్వకు 1.3 కిలోలతో బంగారు కిరీటం తయారు చేయించారు. ఈ కిరీటాన్ని జాతర రోజు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త రాచోటి రామయ్య ఆధ్వర్యంలో అవ్వకు అలంకరిస్తారు. కిరీటం తయారికి సహకరించిన జిఆర్‌టి జ్యువెల్లర్స్, శ్రీచంద్రశేఖర్ ఆజాద్, ఆర్‌జెసి, ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్, పాండురంగా రెడ్డి, జివిఒ, వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ వారికి రాచోటి రామయ్య బుధవారం ధన్యవాదాలు తెలిపారు.


ధర్నా నిర్వహిస్తున్న ముస్లింలు

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ధర్నా

ప్రజాశక్తి - హొళగుంద

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా హొళగుంద బస్టాండ్‌లో బుధవారం ధర్నా చేపట్టారు. ఆలూరు అసెంబ్లీ అధ్యక్షులు ఎఫ్.అబ్దుల్ హామీద్ మాట్లాడుతూ... పార్లమెంట్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ సవరణ చట్టం బిల్లును ప్రవేశపెట్టిందని, ప్రతి ఒక్కరూ ఈ బిల్లును వ్యతిరేకించాలని కోరారు. పార్లమెంట్‌లో బిల్లు పాస్ అయితే రానున్న రోజుల్లో ఒక్క ముస్లిం ఓటు కూడా కూటమికి పడకుండా కృషి చేస్తామని సైఫుల్లా తెలిపారు. రాజ్యాంగ విరుద్ధమైన ఈ బిల్లును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు.

పెద్దమ్మ అవ్వకు కలశ బహూకరణ

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని అలారుదిన్నె గ్రామానికి చెందిన విజయ రాఘవేంద్ర రెడ్డి దంపతులు పెద్దమ్మ దేవాలయానికి సొంత ఖర్చులతో రూ.49 వేల విలువ చేసే కలశాన్ని బుధవారం బహూకరించారు. కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాలయానికి ఇచ్చారు. గురువారం గ్రామంలో బొడ్రాయి, కలశ ప్రతిష్టాపన చేపడుతున్నట్లు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఉపాధి సిబ్బంది బదిలీలు

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలానికి చెందిన ఉపాధి సిబ్బంది వివిధ గ్రామాలకు బదిలీ అయ్యారు. ఈసీ నూర్జహాన్ ఆస్పరి మండలానికి బదిలీ అయ్యారు. సిఒలు వీణ కుమారి, ప్రశాంతి, టిఎ సువర్ణ లతలు గోనెగండ్ల మండలానికి బదిలీ అయ్యారు. బుధవారం నందవరం ఉపాధి కార్యాలయంలో వారికి ఏపీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు, ఉపాధి సిబ్బంది వారిని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఇఒఆర్‌డి సందీప్, కృష్ణమూర్తి, రాజు, శివ, అర్జున్, గణేష్ పాల్గొన్నారు.


సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

మారెమ్మ విగ్రహం ఊరేగింపు



ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో మారెమ్మ విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా బుధవారం గ్రామపుర వీధుల్లో ఊరేగించారు. ఈనెల 4న విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా గురువారం గణపతి పూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, అంకుర్పణతో జలాధివాసం, రత్న దివాసం, దాన దివాసంతో పాటు పూజలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 4న విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి గోపూజ, హోమం, ప్రాణ ప్రతిష్టాపన, పంచామృతాభిషేకం, అన్నదానం జరుగుతున్నట్లు చెప్పారు.

నియోజకవర్గాల్లో పట్టున్న నేత ధరణి రెడ్డి : వైసిపి

ప్రజాశక్తి - మంత్రాలయం

జిల్లాలోని మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు నియోజకవర్గాల్లో పట్టున్న నాయకుడు వై.ధరణిధర్ రెడ్డి అని వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి తెలిపారు. బుధవారం వైసిపి యువ నేత వై.ధరణిధర్ రెడ్డి పుట్టినరోజు వేడుకల సందర్భంగా వైసిపి మండల ఉపాధ్యక్షులు, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. భీమిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా రాఘవేంద్ర సర్కిల్‌లోని రాఘవేంద్ర స్వామి విగ్రహాలకు, దుర్గా మాత, గణపతి విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం గోరుకల్లు కృష్ణ స్వామి, నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం జంగం జగదీష్ స్వామి సోదరుడు జంగం వీరేష్ స్వామి అల్పాహారం పంపిణీ చేశారు. జి.భీమిరెడ్డి, తెల్లబండ్ల భీమయ్యకు నాయకులు అబ్రహాం, ఆనంద్ పూలమాలలు, శాలువాతో సన్మానించారు. వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచులు హోటల్ పరమేష్, వీరనాగప్ప, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి, వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యులు మల్లికార్జున, జనార్ధన్ రెడ్డి, వడ్డే నారాయణ, శివకుమార్, బూదూరు జక్కయ్య పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న నాయకులు

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో రావూస్ జయభేరి

- 1, 3, 5 సెమిస్టర్ ఫలితాల్లో టౌన్ టాపర్లుగా రావూస్ విద్యార్థులు

- సిఇఒ తిరుమలరెడ్డి, సిఒఒ సుజనారెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పరీక్షలు ఏవైనా ఉత్తమ ఫలితాలు రావూస్ కళాశాల సొంతమని, డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో జయభేరి మోగించారని రావూస్ డిగ్రీ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి, సిఒఒ సుజనా రెడ్డి తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ల ఫలితాల్లో పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు జయభేరి మోగించారు. టౌన్ టాపర్లుగా విద్యార్థులు ప్రతిభ చాటారు. 5వ సెమిస్టర్ ఫలితాల్లో బీఎస్సీ కోర్సులు బిజడ్‌సి గ్రూపులో వి.అనిత 9.17, పి.ఎ.విక్టోరియానిస్సి 9.12, ఎస్.తస్లీమ్ 9.07, ఎమ్మెస్సీఎస్ గ్రూపులో కె.దివ్య శ్రావణి 9.04, ఎ.అక్షిత 8.6, కె.శ్రేయ 8.58 జిపిఎ సాధించి టౌన్ టాపర్లుగా నిలిచారు. ఎంపిసిఎస్ గ్రూపులో ఎస్.ఫైమున్నీసా 8.6, ఎస్.ఫైరోజా 8.4, దివ్య 8.12, బికామ్‌లో ఎస్.సహిదా 7.92, యు.ముగతి జ్యోతి 7.88, కె.రాధ 7.84, బిఎలో ఈ.పవిత్ర 7.22, బి.జ్యోతి 7.04, కె.చంద్రిక 7.02, బిబిఎలో బి.మేఘన 7.98, ఎం.జమీల్ 7.27, ఎంకె.యుగంధర్ 6.27 జిపిఎలతో గ్రూప్ టాపర్లుగా నిలిచారు. అలాగే 3వ సెమిస్టర్ బీఎస్సీ కోర్సులు స్టాటిస్టిక్స్ హానర్స్‌లో స్వప్న 9.18, సుకన్య 9.12, ఉమెన్ బీ 8.17, ఫిజిక్స్ హానర్స్‌లో బి.మానస 8.9, తిరుమలశ్రీ 8.6, రమ్య 7.67 కంప్యూటర్ సైన్స్ హానర్స్‌లో ఆఫ్రిన్ భాను 7.85, ఫయాజ్ 7.66, నవదీప్ 7.21, జువాలజీ హానర్స్‌లో ఎం.నర్సా బేగం 8.94, కె.పవన్‌శ్రీ 8.47, ఎస్.సతీష్ 8.12, బోటనీ హానర్స్‌లో ఎన్.భేగం 8.94, జయశ్రీ 8.02, ఐషా సిద్ధిక్ 7.99 బికామ్ హానర్స్‌లో నఫీసబాను 8.09, బి.నిహర్షిత 8.06, నూర్ బాష 7.75, బిఎ ఆర్ట్స్ విభాగంలోని హిస్టరీ హానర్స్‌లో ఎస్.అయేషా 7.72, కె.తేజస్విని 7.3, డికె.ఫాతిమ 7.22, పొలిటికల్ సైన్స్ హానర్స్‌లో మహ్మద్ జైద్ 7.55, ఎస్.కలీద్ 6.93, వి.రాజు 6.57, తెలుగు హానర్స్‌లో కె.ముంతాజ్ బేగం 7.8, యు.లక్ష్మి 7.43, టి.దివాకర్ నాయుడు 7.05, ఎకనామిక్స్ హానర్స్‌లో బి.అరవింద్ 7.2, జి.సానియా 7.02 జిపిఎలతో గ్రూప్ టాపర్లుగా నిలిచారు. 1వ సెమిస్టర్‌లో జువాలజీ హానర్స్‌లో ఎస్.మహ్మద్ 8.64, కె.హేమంత్ కుమార్ 8.59, డి.స్వాతి 8.4, బోటనీ హానర్స్‌లో రాజశేఖర్ 7.59, వైజి.లోకేశ్వరి 7.39, వై.కిరణ్ కుమార్ 6.89, కంప్యూటర్ సైన్స్ హానర్స్‌లో నుజ్జాధ్బీ 7.49, ఎం.గాయత్రి 7.24, డి.ప్రసన్న 7.21, బికామ్ హానర్స్‌లో ఎస్.సహిదా 8.26, కె.జూనేర 7.92, టి.శైలజ 7.67, బిఎ హానర్స్ కోర్సులైన హిస్టరీ హానర్స్‌లో బి.శ్రావణి సంధ్య 6.87, బి.నందిని 6.55, బి.శ్రావణి 6.46, పొలిటికల్ సైన్స్ హానర్స్‌లో కె.నజీరా 7.17, జె.అన్వేష్ 6.96, ఎం.మహబూబ్ 6.84, తెలుగు హానర్స్‌లో జి.నాగవేణి 6.09, కె.ఉపేంద్ర 6.01, ఎస్.కల్పన 6.01 జిపిఎలు సాధించి గ్రూప్ టాపర్లుగా నిలిచారు. ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, అకాడమిక్ డీన్ వీరేష్, నోడల్ ఆఫీసర్ శ్రుతి ప్రియా, ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జీ విజయ్ కుమార్, స్క్రిప్ రైటర్ పాల్ రాజ్, సీనియర్ అధ్యాపకులు గోరంట్ల, రామకృష్ణ, నందిని, రాజేశ్వరి, సంధ్య, విజయరాజు, మనోవెంకట్, సంపత్, ధనుంజయ, గోవిందులు బుధవారం విద్యార్థులను అభినందించారు.



మంచి మార్కులు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం, అధ్యాపకులు



ధ్రువపత్రాలు అందజేస్తున్న సర్పంచి

విద్యపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలి

- సర్పంచి పాల్ దినకరన్

ప్రజాశక్తి - కౌతాళం

ప్రతి విద్యార్థికీ విద్యపై ఆసక్తిని పెంచాలని సర్పంచి పాల్ దినకరన్, జెకెఎల్ఎస్ కరస్పాం డెంట్ లింగన్న కోరారు. బుధవారం పాఠశాలలో విష్ ఇంగ్లీష్ వేడుకల సందర్భంగా స్థానిక జెకెఎల్ఎస్ ఇంగ్లీష్ మీడియం యుపి స్కూల్ పాఠశాలలో విష్ ఇంగ్లీష్ రాత పరీక్ష నిర్వహించి ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చదువుపై విద్యార్థులకు ఆసక్తి కలిగించి బోధించాలని తెలిపారు. రాయడంలో తప్పులను గుర్తించి, వాటిని చూపించి సరిదిద్దడంతో అలాంటి తప్పులు పునరావృతం కావని చెప్పారు. విద్యార్థులు రాయడం, చదవడం నేర్చుకున్నప్పుడే రాణిస్తారని తెలిపారు. పాఠశాలలో ప్రతి సబ్జెక్టుపైనా ఇలాంటి కార్యక్రమం చేపడతున్నామని చెప్పారు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఐ.పి.నెం.48/2023

ఎం.అమర్నాథ్‌రెడ్డి. ...అర్జీదారు

- వర్సెస్ -

పోతురాజు ప్రమీల 6 ఇతరులు. ...రెస్పాండెంట్లు

4 మరియు 5 రెస్పాండెంట్లకు నోటీసులు

4).మల్లికార్జున, చైర్‌పర్సన్,వాసవి ఇంగ్లీష్ మీడియంస్కూలు, డి.నెం.3-86, బి.తాండ్రపాడు గ్రామం, కర్నూలు మండలం, కర్నూలుజిల్లా.

5). మాధురిలత భర్త మల్లికార్జున, టీచర్, వాసవి ఇంగ్లీష్ మీడియంస్కూలు, డి.నెం.3-86,బి.తాండ్రపాడు గ్రామం, కర్నూలు మండలం, కర్నూలుజిల్లా.

పై అర్జీ(డెబిటార్-ఐ.పి)లో అర్జీదారు, రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా నోటీసులు ముట్టనందున కోర్టువారి అదేశానుసారము ఈ ప్రకటన ద్వారా తెలియజేయడం ఏమనగా సదరు పై అర్జీ గురించి మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 7-4-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అద్వకేటు ద్వారా కాని హాజరై పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదురు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది: 7-04-2025

జి.చలపతిరావు,
యం.జాఫర్‌హుసేన్ బేగ్,
ఎ.అనిల్‌కుమార్,
అర్జీదారు పరం అద్వకేట్లు,
కర్నూలు.